క్లుప్తంగా

నేడు గాంధీనగర్‌లో 'స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'

యలమంచిలి రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజీఎస్ ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, సెక్షన్ అధికారులు, మెప్మా, సచివాలయ సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలియజేసిన అధికారులు, సిబ్బంది హాజరు కాని యెడల సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: తోటాడ పంచాయతీలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. శుక్రవారం పాలక వర్గ సభ్యులతో ఆమె సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల పరిధిలోని సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ కాంగ్రెసుల వెంకటలక్ష్మి, దొడ్డి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

8న యాదగిరిపాలెంలో మరిడిమాంబ విగ్రహావిష్కరణ



మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని యాదగిరిపాలెంలో ఈ నెల 8న మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు ఉత్సవ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేలా చూడాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి గణేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పోషకాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి రమ్య

మునగపాక : కౌమార దశలోని బాలికలకు సరైన పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి ఎల్.వి.రమ్య అన్నారు. మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు వయసున్న బాలికలతో సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బాలికలు సన్మార్గంలో నడిచేలా చూడాలన్నారు. బాలల రక్షణ, ఆరోగ్యం, విద్య, సాధికారత, లింగ వివక్ష, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా కార్యదర్శి హిమ, పలువురు బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పొక్లెయిన్‌తో కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెంలో శుక్రవారం పారిశుధ్యం మెరుగుపరిచే పనులను ముమ్మరంగా చేపట్టారు. గురువారం ఈ గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సందర్శించి, పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామంలోని కాలువల్లో పూడిక తీశారు. పొక్లెయిన్ సాయంతో రహదారుల వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ రాజాన మహాలక్ష్మి తెలిపారు. పంచాయతీ తీసుకుంటున్న చర్యలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చూచుకొండ-గణపర్తి గ్రామాల మధ్య శిథిల స్థితికి చేరిన బ్రిడ్జి

వంతెనలు శిథిలం.. ప్రయాణం భయం

ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని భయపెడుతున్నాయి. పురాతన బ్రిడ్జిలపైనే నేటికీ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ప్రమాదకరంగా మారాయి. వంతెనల అడుగు భాగాలు దెబ్బతిని ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. నిత్యం భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్న పరిస్థితులు అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. పాత వంతెనల స్థానంలో పునర్నిర్మాణం చేపట్టడమో, లేదా కనీస మరమ్మతులు చేపట్టడం గానీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. – మునగపాక

మునగపాక మండలంలో ప్రమాదవుటంచున బ్రిడ్జిలు | కనీస మరమ్మతులు చేపట్టని అధికారులు | భయం గుప్పిట్లో వాహనచోదకుల రాకపోకలు

దెబ్బతిన్న వారధి

మునగపాక మండలం చూచుకొండ-గణపర్తి గ్రామాల మధ్య రోలుగెడ్డ కాలువపై ఉన్న బ్రిడ్జి కూడా శిథిల స్థితికి చేరుకుంది. ఈ వంతెన మీదుగా నిత్యం పలు గ్రామాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. అటు అచ్యుతాపురం, ఇటు మునగపాక అలాగే యలమంచిలికి వెళ్లాలంటే దగ్గర మార్గం కావడంతో ఈ బ్రిడ్జి మీదుగానే నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. బ్రిడ్జి అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఆందోళన చెందుతున్నారు.



మునగపాకలో సత్తెమ్మతల్లి గుడి సమీపంలో శిథిలమైన వంతెన అడుగుభాగం

పొంచి ఉన్న ముప్పు

మునగపాకలో ముసిలితల్లి గుడికి వెళ్లే మార్గంలో సత్తెమ్మతల్లి గుడి దరి ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ మార్గంలో నిత్యం అరబుపాలెం, మునగపాకకు చెందిన ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బ్రిడ్జి దుస్థితి దయనీయంగా ఉంది. బ్రిడ్జి అడుగభాగం పూర్తిగా దెబ్బతింది. దీంతో బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం స్థానికులను వెంటాడుతోంది. సాగునీటి కాలువపై నిర్మించిన ఈ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది.



పూడిమడక రోడ్డులో మునగపాక కృష్ణంరాజు కాలువపై శిథిలావస్థలో ఉన్న బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి

ప్రమాదకరంగా బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి

మునగపాక మెయిన్ రోడ్డులో కృష్ణంరాజు కాలువపై బ్రిటిష్ వారు బ్రిడ్జి నిర్మించారు. సుమారు 130 సంవత్సరాల క్రితం నిర్మించిన బ్రిడ్జి కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి అడుగు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం వందలాది వాహనాలు రయ్‌రయ్ మంటూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు అధిక లోడుతో వాహనాలు వెళ్తున్న సమయంలో ఊగుతోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు విస్తరణతో పాటు కొత్త వంతెన నిర్మాణంపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలి ఉంది.

పురాతన బ్రిడ్జిలపై దృష్టి సారించాలి



పురాతన బ్రిడ్జిలపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలి. మండలంలోని పలు చోట్ల సాగునీటి కాలువలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. బ్రిడ్జిలపై రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటోంది. ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జిల స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– గుంట్ల అప్పారావు, ద్విచక్ర వాహనదారుడు, మెలిపాక

వంతెనల పునర్నిర్మాణం అవసరం



శిథిలావస్థకు చేరిన వంతెనలకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి. శిథిలావస్థకు గురైన బ్రిడ్జిలను తొలగించి కొత్తవి నిర్మించాల్సిన అవసరం ఉంది. మునగపాకలో పురాతన వంతెన పునర్నిర్మాణానికి చర్యలు జరుగుతున్నాయి.

– ఎస్.ఆదిమహేశ్వరరావు, తహసీల్దార్, మునగపాక

పీర్ల పంజా భూములపై విచారణ



చినబోదిగల్లంలో విచారణ నిర్వహిస్తున్న వక్ఫ్ బోర్డు అధికారులు

నక్కపల్లి: మండలంలో చినబోదిగల్లంలో సర్వే నంబరు 142/3లో ఉన్న పీర్ల పంజా భూములపై శుక్రవారం వక్ఫ్‌బోర్డు అధికారులు విచారణ చేపట్టారు. ఈ సర్వే నంబరులో 3.06 ఎకరాలు ఉన్నాయి. ఈ భూములు చల్లా సత్యనారాయణశాస్త్రి 1912లో పీర్ల పంజా(ముస్లింల మాన్యం)కు ఇచ్చారు. గ్రామస్తులంతా కలసి ఈ భూమిని ఓ వ్యక్తికి శిస్తుకు ఇచ్చారని, ఆయన కొన్నాళ్ల తర్వాత రికార్డులు తారుమారు చేసి భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ గ్రామస్తులు వక్ఫ్‌బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు అధికారి ఏకే నజీర్, ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌మొహిద్దీన్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వందేళ్ల క్రితం ఈ భూమి ముస్లిం గ్రామానికి ఇచ్చారని, పీర్ల పంజా పేరుతో ఉన్న భూములను లీజుకు ఇవ్వడం ద్వారా వచ్చిన ఆదాయంతో గ్రామంలో పండగలు నిర్వహించేవారమన్నారు. లీజుకు తీసుకున్న కౌలుదారులు రికార్డులు తారుమారు చేసి భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి ఈ భూములు పీర్లపంజాకు చెందుతాయని నిర్ధారించారన్నారు.

రేపు ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారి జాతర

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు ప్రధాన ఆరాధ్య దైవం మోదకొండమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గత నెల 5న అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం తొలేళ్ల జాతర, అనంతరం ఏలేనుగులు ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవి రావు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద ప్రసాదం, మజ్జిగ పంపిణీ వంటివి దాతలు సహకారంతో జరుగుతుంది. రాగమాలిక ఆర్కెస్ట్రా, తూర్పు రామాయణం, సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం నుంచి బండ్ల వేషాలు, నేలవేషాలు, తప్పెటగుళ్లు, మహిళలు కోలాటం ప్రదర్శించనున్నారు.

ఆసక్తి ఉన్న ఎస్టీలకు ఉచితంగా కోళ్ల పంపిణీ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోటవురట్ల: కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న ఎస్టీ అభ్యర్థులకు ట్రైకార్ ద్వారా ఉచితంగా కోడి పిల్లలను అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బి.రామమోహనరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు సంవర్ధక శాఖాధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ సబ్‌ప్లాన్‌లో భాగంగా ట్రైకార్ ద్వారా 15 కోళ్లు, 50 కిలోల దాణాను ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం మండలంలోని గిరిజన గ్రామాల నుంచి ఆసక్తి ఉన్నవారిని ఎంపిక చేయనున్నామన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఒక పాడి పశువును కలిగి ఉంటే మరో పాడి పశువును అందించేందుకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. కోటవురట్ల, మాకవరపాలెం మండలాలలో పశువులకు టీకాలు వేస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ పెట్ల నరేష్, రెండు మండలాల పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాదరావు



శిక్షణకు హాజరైన విద్యార్థులు

మునగపాక: వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు కిల్లాడి ప్రసాదరావు సూచించారు. మునగపాకలోని సంతబయల గౌతమ పఠన మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో శిక్షణ పూర్తి చేయాలన్నారు. పఠన మందిరంలో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యాభివృద్ధికి గౌతమ పఠన మందిరం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. గౌతమ పఠన మందిర అధ్యక్షుడు దాడి సూరిబాబు, పెద్దలు మారిశెట్టి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, మోహనరావు, దాడి అప్పలనాయుడు, ఆడారి లక్ష్మణరావు, దాడి శ్రీరామమూర్తి, కుంది సూర్యనారాయణ, వెలగా ప్రవీణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

5న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా

అమర్‌నాథ్ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా గుడివాడ అమర్‌నాథ్ ఈ నెల 5న స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి పాలనపై ఏడాదిలోనే గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు వస్తాయోనని ఎదురు చూస్తున్నారని, మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా తీసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు విఫలమయ్యారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమిపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. మరో రెండు సంవత్సరాలు ప్రజలు పక్షాన పోరాటాలు చేసినట్లయితే రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలే మంచి భవిష్యత్‌ను అందిస్తారన్నారు. జగన్ 2.0 కార్యక్రమానికి పార్టీ శ్రేణులు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

వారం రోజుల్లో గ్రామస్థాయి కమిటీలు..

గ్రామాల్లో వారం రోజుల్లో పార్టీ ఆదేశాలు మేరకు నూతన కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని మలసాల భరత్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచి ఇతర పార్టీల్లోకి జంప్ అయిన వ్యక్తులకు అక్కడ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. జిల్లాలో కూటమి నాయకులు త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటమి చెందినప్పటికీ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ కూటమి నేతలు అనకాపల్లి, కశింకోట మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ఇతర వర్గాల నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు. కూటమి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైనా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాదిలోనే పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, కూటమి పాలనలో కన్నీరే మిగిలిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్ ప్రయాణ స్వీకారం సందర్భంగా జిల్లాలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, అనకాపల్లి, కశింకోట మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కొట్నాల పద్మకుమారి, తగరంపూడి నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాడుక నీరు తిష్ట



తిమ్మాపురం ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వాడుకనీరు

ఎస్.రాయవరం: తిమ్మాపురం పంచాయతీలో వాడుకనీరు రోడ్డుపై నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వాణిజ్య సముదాయాలు, ఆస్పత్రి భవనాల నుంచి వాడుకనీరు నేరుగా రోడ్డుపైకి వదిలేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందవుతోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పాడై గతుకుల మయమైంది. అలాగే అడ్డురోడ్డు జంక్షన్‌లో కూడా పలు దుకాణాల నుంచి వాడుక నీరు నేరుగా రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే అడ్డురోడ్డు జంక్షన్‌లో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాడుకనీరు రోడ్డుపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆధునిక పద్ధతులతో ఆశాజనకంగా వేరుశనగ

దేవరాపల్లి : ఆధునిక వ్యవసాయ పద్ధతులలో సాగు చేయడం ద్వారా వేరుశనగలో ఆశాజనకంగా దిగుబడి వస్తుందనడానికి సీతంపేట రైతే నిదర్శనమని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, సత్తిబాబు అన్నారు. నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేటలో రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు సాగు చేసిన వేరుశనగ పంటను స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి శుక్రవారం వారు క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. గ్రామానికి చెందిన రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు టీసీజీఎస్-1694 రకం వేరుశనగ పంటను సాగు చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంట సాగు చేసిన నాటి నుంచి పంట తీసే వరకు ప్రతి నెలా పంటను పరిశీలిస్తూ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణ చర్యలను, సలహాలు, సూచనలు చేశారు. ఎకరానికి 60 కేజీల విత్తనం నాటగా, 1200 కేజీలకు పైబడి దిగుబడి వచ్చిందని, సాగు ఖర్చు రూ. 23,600 కాగా, రూ. 50వేలుకు పైబడి రాబడి వచ్చినట్టు రైతు అచ్చింనాయుడు తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



వెంకటాపురంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ విభీషణరావు

ఎస్.రాయవరం: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ విభీషణరావు హెచ్చరించారు. వెంకటాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు తెరుస్తున్నట్టు సమాచారం వస్తుందని, పట్టుబడితే జైలుకు వెళ్లక తప్పదన్నారు. బెల్టు దుకాణాలకు లైసెన్స్ దుకాణదారులు సహకరిస్తున్నట్టు రుజువైతే నిబంధనలు ప్రకారం లైసెన్స్ రద్దు అవుతుందని చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే పోలీసు, ఎక్సైజ్ సిబ్బందికి నేరుగా సమాచారం ఇవ్వొచ్చన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిశా శ్రీమూర్తులు, యువకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



రాట్నాలపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చట్టబద్ధమైన వయస్సు వచ్చాక మాత్రమే వివాహాలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకదుర్గ సూచించారు. రాట్నాలపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. చిన్న వయస్సులో మానసిక పరిణితి సరిగ్గా ఉండదని, తద్వారా వైవాహిక జీవితంలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. కిశోర బాలికలకు అన్ని విధాలుగా అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే పోలీసులు, ఐసీడీఎస్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్తేరు రాణి, లక్ష్మి, రాణి, అప్పలనర్స, పురం గంగ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం



తోటాడ-మూలపేట రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అందరూ నిద్రకు ఉపక్రమించే సమయంలో గాలులు, ఉరుములతో వర్షం పడింది. తోటాడ-మూలపేట మార్గంలో విద్యుత్ స్తంభం, తాటి చెట్టు నేలకొరిగాయి. రాత్రి వేళ విద్యుత్ స్తంభం పడిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. పగటి పూట పడిపోయి ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని పలువురు అభిప్రాయపడ్డారు. తాటిచెట్టు కూడా రహదారికి అడ్డంగా పడిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు ఎంతగానో దోహదపడతాయని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్ల ధర్నా

నర్సీపట్నం : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నర్సీపట్నం యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం ఇవ్వాలని..పెండింగ్ వేతనాలను చెల్లించాలని నినాదాలు చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయం డిటి ఆశోక్‌కు అందజేసారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు అడిగర్ల రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు వాహనాల నిర్వహణ సంస్థలు మారుతున్నాయి తప్ప డ్రైవర్ల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. రూ.8,800 జీతంలో కుటుంబాలను పోషించుకోలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ జీతాలు సకాలంలో చెల్లించకుండా నాలుగు, ఐదు నెలలకొకసారి వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె ద్వారా సేవలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు.